AKSHARA TODAY
అక్షరటుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

బస్సుల నడవక అవస్థలు

2

2

నేషనల్ హైవేపై ట్రక్కులో చెలరేగిన

ప్రజావాణికి 114 ఫిర్యాదులు

అక్షరటుడే, ఇందూరు: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 114 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీఆర్డీవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీపీవో శ్రీనివాస్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

8-9-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇప్పించాలని ఆర్పీల డిమాండ్

అక్షరటుడే, ఇందూరు: ఆర్నెళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇప్పించాలని మెప్మా ఆర్పీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ అంకిత్‌కు అరుణోదయ రిసోర్స్ పర్సన్స్ సొసైటీ తరఫున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు స్వర్ణలత మాట్లాడుతూ.. జీవో 164 ఆధారంగా వీఎల్ఆర్ నుంచి ఆర్పీలకు జీతాలు ఇవ్వాలని ఉందని.. దీంతో తమకు జీతాలు అందడం ఆలస్యమవుతోందన్నారు. 2025 మార్చిలో సెర్ప్, మెప్మా విలీనమవుతోందని చెప్పారని.. కానీ ఇప్పటివరకు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రతి సర్వేలో తాము పాల్గొని విజయవంతంగా పూర్తి చేశామని స్వర్ణలత పేర్కొన్నారు. సొసైటీ జిల్లా కార్యదర్శి మంజుల, కోశాధికారి స్వప్న, జ్యోతి, సుమలత, విజయ, జయ పాల్గొన్నారు.

ప్రపంచ దేశాలకు భారత్ ఆదర్శం

అక్షరటుడే, ఇందూరు: అభివృద్ధిలో ప్రపంచ దేశాలకు భారత్ ఆదర్శంగా నిలుస్తోందని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చినందుకు కృతజ్ఞతగా ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు సోమవారం గాంధీచౌక్‌లో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాలు వినియోగించే వస్తువులపై భారీ పన్ను ఊరట కల్పించడం హర్షణీయమన్నారు. వ్యాపార రంగాలకు మోదీ సర్కారు దీపావళి కానుక ప్రకటించిందన్నారు. ప్రధానంగా ఆరోగ్య, జీవిత బీమాలతో పాటు 33 రకాల అత్యవసర మందులపై జీరో జీఎస్టీ ఒక విప్లవాత్మక నిర్ణయం అని పేర్కొన్నారు. విద్యారంగ సామగ్రిపై జీరో జీఎస్టీ, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులపై 28 శాతం నుంచి 18 శాతం తగ్గించారని ఇది రాబోయే నూతన సాంకేతిక రంగ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీ అని వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ వంటి నాయకులకు ఈ నిర్ణయం చెంపపెట్టులాంటిదన్నారు. 2047 వరకు భారత్‌ను ప్రపంచ దేశాల్లో అగ్రదేశంగా నిలబెట్టే దిశగా బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు బంటు రాము, న్యాలంరాజు, జ్యోతి, వనిత, మండల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. నాయకులు, అధికారుల అండదండలతో ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా బహుళ అంతస్తుల భవనాలను నిర్మిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొన్ని.. అనుమతులు లేకుండా మరికొన్ని నిర్మాణాలు చేపడుతున్నారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. భీమ్‌గల్ పట్టణంలో అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా.. సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ప్రభుత్వ స్థలాలు, చెరువులు కూడా కబ్జాలకు గురవుతున్నాయి. బాబాపూర్ రోడ్డులో ఇనాం భూముల్లో, బెజ్జోర బైపాస్ రోడ్డులో, బడాభీమ్‌గల్ రోడ్డులో గల రాథం చెరువును ఆనుకుని వెలసిన అక్రమ కట్టడాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

– అక్షరటుడే, భీమ్‌గల్

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

▸ అనుమతికి మించి భవనాల నిర్మాణం ▸ ప్రభుత్వ భూములు, చెరువుల కబ్జా ▸ పట్టించుకోని అధికారులు

భీమ్‌గల్ మున్సిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు లేరు. ఇళ్ల నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతులు ఇస్తుంది. ఇక్కడ ఇన్‌ఛార్జి టీపీఎస్ పని చేస్తున్నారు. వారంలో ఒక్క రోజు మాత్రమే ఆయన భీమ్‌గల్ వస్తారు. అక్రమ నిర్మాణాలపై ఆయనకు కనీస అవగాహన కూడా లేదు. నెల రోజుల నుంచి ఆయన భీమ్‌గల్‌కు రావడం లేదు. ఈ విభాగంలో సిబ్బంది కొరతతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇంటి నంబర్ల కేటాయింపు

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కట్టిన నిర్మాణాలకు మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్లు ఇస్తుండడం గమనార్హం. ఇలా కేటాయించడానికి రూ. లక్షల్లో ముడుపులు దండుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. భీమ్‌గల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల సమీపంలో ఇలా మూడు భవనాలకు నంబర్లు ఇచ్చారు. అలాగే వేల్పూర్ రోడ్డులో పదుల సంఖ్యలో భవనాలకు అనుమతులు లేవు. వాటికి కూడా మున్సిపాలిటీ అధికారులు ఇంటి నంబర్లు కేటాయించారు. కొన్ని చోట్ల నివాసాల కోసం అనుమతులు తీసుకుని కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. నిబంధనలు పాటించకుండా నిర్మించిన భవనాలను గుర్తించి తగు చర్యలు తీసుకుంటాం. సంబంధిత ఇంటి యజమానులకు నోటీసులు అందజేస్తాం.

– గోపు గంగాధర్, మున్సిపల్ కమిషనర్

మచ్చుకు కొన్ని..

- పురాణీపేట్ రోడ్డులో రెండంతస్తుల భవనాలు అనుమతులు లేకుండా కడుతున్నారు.
- భీమ్‌గల్‌లోని బైపాస్ రోడ్డులో ఇంటి కోసం అనుమతి తీసుకుని కమర్షియల్ భవనం నిర్మిస్తున్నారు.
- బెజ్జోర బైపాస్ రోడ్డులో సుమారు 20 నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు లేవు. ఇవన్నీ ఒకే వార్డు పరిధిలో ఉన్నాయి.
- బడాభీమ్‌గల్ రోడ్డు వెంట ఉన్న పాత పెట్రోల్ బంక్ సమీపంలో పెద్ద ఎత్తున కమర్షియల్ షెల్టర్లు నిర్మిస్తున్నారు. వీటిని కనీసం మున్సిపల్ అధికారుల కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు.
- వేల్పూర్ రోడ్డులో ఇంటి నిర్మాణం పేరిట నాలుగు అంతస్తుల పెద్ద భవనాన్ని నిర్మించారు.
- బెజ్జోర బైపాస్ రోడ్డులో వ్యవసాయ భూమిలో ఇళ్లు కడుతున్నారు.
- బడాభీమ్‌గల్ రోడ్డులోని రాథం చెరువులో పదుల సంఖ్యలో నిర్మాణాలు జరిగాయి.
- లింబాద్రిగుట్ట సమీపంలోని అసైన్డ్ భూముల్లో వెంచర్లు వెలిశాయి. అందులో గెస్ట్ హౌస్లు, వ్యాపార సముదాయాలు ఉన్నాయి.

ఎల్లారెడ్డి నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు ప్రారంభం

అక్షరటుడే, ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి నుంచి ఇతర ప్రాంతాలకు బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు పున: ప్రారంభించారు. కామారెడ్డి జిల్లాలో గత నెల 26, 27 తేదీల్లో భారీ వర్షం బీభత్సం సృష్టించిన విషయం తెలిసిందే. వర్షం కారణంగా చాలా రోడ్లు కొట్టుకుపోయాయి. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్, బాన్సువాడ, కామారెడ్డి ప్రాంతాలకు వెళ్లే మార్గాల్లో రోడ్లు కొట్టుకుపోవడంతో ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లు తెగిపోయిన ప్రాంతాల్లో అధికారులు మట్టి పోసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. అయితే మట్టి రోడ్డు దిగబడుతుందని బస్సులు, ఇతర భారీ వాహనాలను ఆయా మార్గాల్లో అనుమతించలేదు. దీంతో గత నెల 27 నుంచి ఎల్లారెడ్డికి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. తాజాగా అధికారులు బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి, బాన్సువాడ మార్గాల్లో రోడ్లకు గతంలోనే మరమ్మతులు చేశారు. అయితే ఎల్లారెడ్డి నుంచి మెదక్, హైదరాబాద్ వెళ్లే మార్గంలో పోచారం ప్రాజెక్ట్ దిగువన బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకుపోయింది. ఇక్కడ మరమ్మతు పనులు ఇటీవల పూర్తి చేశారు. మూడు రోజుల క్రితం రోడ్డు మరమ్మతులు పూర్తి కాగా.. తాజాగా ఆర్టీసీ బస్సులు సైతం రాకపోకలు సాగిస్తున్నాయి

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

అక్షరటుడే, కమ్మర్‌పల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కమ్మర్‌పల్లి మండలంలోని అమీర్‌నగర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రీడాపోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భగా క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. అలాగే క్రీడల్లోనూ రాణించినట్లయితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. పోటీల సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. టోర్నీలో మండల స్థాయిలో మొత్తం 12 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పాల్గొంటున్నాయి. పోటీలు 10వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి ఎంఈఓ ఆంధ్రయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెం చిన్నయ్య, పీడీ విద్యాసాగర్ రెడ్డి, పవన్, నాగభూషణం, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి పెరిగిన ఇన్‌ఫ్లో.. ఎనిమిది గేట్ల ఎత్తివేత

అక్షరటుడే, ఆర్మూర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాం తం వరద పెరుగుతోంది. దీంతో గోదావరిలోకి నీటిని వదులుతున్నారు. ఎగురు కురుస్తున్న వర్షాలతో సుమారు 54,185 క్యూసెక్కుల వరద సోమవారం ప్రాజెక్టుకు వచ్చింది. దీంతో స్పందించిన అధికారులు 8 వరద గేట్లను ఎత్తి గోదావరిలోకి 25 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 19,000 క్యూసెక్కుల వర ద, కాకతీయ ద్వారా 5,500 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 2,500 క్యూసెక్కులు, మిషన్ భగీరథ 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గుత్ప ఎత్తిపోతలకు 270 క్యూసెక్కులు వదులుతున్నారు. అలాగే ఆవిరి రూపంలో 684 క్యూసెక్కుల నీరు ఆవిరిగా పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.501టీఎంసీ)లకు గాను.. ప్రస్తుతం ప్రాజెక్టులో 1091 అడుగులు (80.501టీ ఎంసీలు) ఉంది. గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి తెలిపారు. పశువుల కాపరులు, రైతులు, ప్రజలు ఎవరూ నది వైపు వెళ్లవద్దని సూచించారు.

వాహనాల వేగాన్ని నియంత్రించేందుకే స్పీడ్ గన్స్

అక్షరటుడే, కామారెడ్డి: వాహనాల వేగాన్నికట్టడి చేసేందుకు స్పీడ్ లేజర్ గన్స్ వాడుతున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. వాహనాల వేగాన్ని నియంత్రించడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయన్నారు. దీంతో ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని సదాశివనగర్ పరిధిలో స్పీడ్ లేజర్ గన్స్‌ను కలెక్టర్, ఎస్పీలు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకున్న భద్రతా చర్యలు, కట్టుదిట్టమైన నిబంధనల అమలు ఫలితంగా ఈ ఏడాది రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. 2024 ఆగస్టు వరకు జిల్లాలో మొత్తం 188 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 2025 ఆగస్టు వరకు వాటిని 145కి తగ్గించగలిగామని తెలిపారు. దీని ద్వారా మొత్తం 22.9శాతం తగ్గుదల నమోదైందన్నారు. అదేవిధంగా మరణాలు 197 నుంచి 153కి తగ్గి 22.3శాతానికి తగ్గిందన్నారు. అలాగే గాయపడ్డ కేసులు కూడా 181 నుంచి 173కి తగ్గగా, గాయపడిన వారి సంఖ్య 355 నుంచి 298కి తగ్గడం ద్వారా ప్రమాదాల నియంత్రణలో గణనీయమైన తగ్గుదల నమోదైందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో రోడ్డు భద్రతా చర్యల విజయాన్ని సూచిస్తూ, ప్రజల ప్రాణ రక్షణలో ఒక గొప్ప ముందడుగుగా నిలిచిందన్నారు. ఇకపై ఈ లేజర్ గన్స్ 44వ జాతీయ రహదారి, 161 జాతీయ రహదారి, రాష్ట్ర రహదారులపై ఉంటాయని చెప్పారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా స్రవంతి రెడ్డి

అక్షరటుడే, ఇందూరు: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా గోపిడి స్రవంతి రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఉత్తర్వులు జారీ చేశారు. స్రవంతి రెడ్డి నగరపాలక సంస్థలో బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా, అధికార ప్రతినిధిగా పనిచేశారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారికి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వా లక్ష్మీ నర్సయ్య

అక్షరటుడే, ఇందూరు: భారతీయ జనతా పార్టీ ఆయా మోర్చాల రాష్ట్ర అధ్యక్షులను పార్టీ నియమించింది. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సోమవారం ప్రకటించారు. కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా బస్వా లక్ష్మీ నర్సయ్యను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గంలో పనిచేశారు. ఈ సందర్భంగా బస్వా లక్ష్మీ నర్సయ్య మాట్లాడుతూ.. రైతుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీపీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 13న జరిగే చాలామంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్నచిన్న కేసులు, ట్రాఫిక్ చలాన్లు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు. అంతేకాకుండా లోక్ అదాలత్ అనేది ఒక శాంతియుత పరిష్కార విధానమని పేర్కొన్నారు. కోర్టు కేసుల్లో త్వరగా పరిష్కారం చేసుకునే అవకాశం దొరుకుతుందన్నారు.

జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

అక్షరటుడే, ఇందూరు : ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అన్ని కేటగిరీల్లో కలిపి మొత్తం 40 మందిని ప్రకటించారు. అయితే 5వ తేదీన సెలవు దినం కావడంతో మంగళవారం అవార్డులను ప్రదానం చేయనున్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని డీఈవో అశోక్ తెలిపారు. ప్రధానోపాధ్యాయుల కేటగిరిలో.. హరిచరణ్ (కుకునూరు, వేల్పూర్), సురేష్ కుమార్ (డొంకేశ్వర్) రవీందర్ (మామిడిపల్లి), రాంప్రసాద్ (కోనాపూర్,కమ్మర్‌పల్లి). స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో.. రాజశేఖర్ (ఏర్గట్ల, జెడ్పీహెచ్ఎస్), మల్లేష్ (రేంజర్ల జెడ్పీహెచ్ఎస్), శ్రీనివాసరాజు (టీజీఎంఎస్, బాల్కొండ), శ్రీనివాస్ (బాల్కొండ జెడ్పీహెచ్ఎస్), ప్రశాంత్ కుమార్ (బాల్కొండ జెడ్పీహెచ్ఎస్), ఎన్.శ్రీనివాస్ (మెండోరా, జెడ్పీహెచ్ఎస్), గణేష్ (ఆలూర్ జెడ్పీహెచ్ఎస్) స్రవంతి (ఆర్మూర్, కేజీబీవీ), సయ్యద్ అబ్దుల్ నహీం (నీలా జెడ్పీహెచ్ఎస్), గంగాధర్ (కుకునూర్ జెడ్పీహెచ్ఎస్), సుజాత (ముచ్కూర్ జెడ్పీహెచ్ఎస్), లక్ష్మీనారాయణ (ఎడపల్లి జెడ్పీహెచ్ఎస్), సాయిలు (డొంకేశ్వర్ జెడ్పీహెచ్ఎస్), స్వప్న (డిచ్‌పల్లి జెడ్పీహెచ్ఎస్). శివకుమార్ (శివతండా, నవీపేట్), పెద్ది రమణ (కుర్నాపల్లి, ఎడపల్లి), ఎస్ కే అబ్దుల్ (వెల్మల్, నందిపేట్), ప్రవీణ్ కుమార్ రెడ్డి (గుంజిలి, మాక్లూర్), శ్రీనివాస్ (మోతె, వేల్పూర్), విజయలక్ష్మి (నాగపూర్, నవీపేట్), రాజు (ఇసాపల్లి, ఆర్మూర్), సునీత (ఆర్మూర్), వెంకటేశ్వర్లు (బర్దిపూర్, బోధన్) శృతిమ (శ్రీరాంపూర్, బాల్కొండ), అల్తాఫుద్దీన్ (ఫతేపూర్, సాలురా), నరేంద్ర శేఖర్ (బాగేపల్లి, రెంజల్). శంకర్ (బోర్గాం, మొపాల్), సాయన్న (ఖిల్లా జీహెచ్ఎస్), హఫీజుద్దీన్ (బెజ్జోరా, భీమ్‌గల్), ఆదిల్ అహ్మద్ (నిజాం కాలనీ, నిజామాబాద్), శ్రీనివాస్ (చౌటుపల్లి, కమ్మర్‌పల్లి), కిషన్ (నారాయణపేట్, జక్రాన్‌పల్లి), శ్రీనివాస్ (వేంపల్లి, ముప్కాల్), సునీత (నాలేశ్వర్, నవీపేట్), సుజాత (పులాంగ్ నిజామాబాద్), రమేష్ (మానవతా సదన్, కేర్‌టేకర్).

తపాలా కార్యాలయానికి స్థలం కేటాయించాలి

అక్షరటుడే, భీమ్‌గల్: పట్టణంలో తపాలా కార్యాలయానికి భవనం మంజూరు కాగా, భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యోగేశ్వర నర్సయ్య, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, సీనియర్ నాయకులు సంధ్యరాజు, పతాని ప్రవీణ్, నీలం గంగాధర్, యువ మోర్చా అధ్యక్షుడు రాగి అజయ్ పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

అక్షరటుడే, ఎల్లారెడ్డి: మండలంలోని వెల్లుట్ల గ్రామంలో జలజీవన్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించారు. సొసైటీ సీఈవో రవికుమార్, జిల్లా కో-ఆర్డినేటర్ అంజమ్మ హాజరై స్థానిక నాయకులతో కలిసి కార్యక్రమం ప్రారంభించారు. ముందుగా మహిళలకు 50శాతం రాయితీపై కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో సాయిలు, సొసైటీ ఛైర్మన్, స్థానిక మాజీ సర్పంచ్ రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

అక్షరటుడే, లింగంపేట: మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. పలు వస్తువులపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు మహారాజుల మురళి, జిల్లా మహిళా నాయకులు పెద్ది సంగీత, నాయకులు మాసుల శ్రీనివాస్, విష్ణువర్ధన్, సుభాష్, సాయిలు, రవి పాల్గొన్నారు.

జిల్లాలో గత నెలలో కురిసిన భారీ వర్షా నికి చాలా చోట్ల రోడ్లు తెగిపోయాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు వరదల ధాటికి అతలాకుతులం అయ్యాయి. భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి పారడంతో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వంతెనలు కూలిపోయి రవాణా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. కామారెడ్డి నుంచి లింగంపేట, లింగంపేట నుంచి ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. అధికారులు పలు చోట్ల రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయినా కానీ పలు గ్రామాలకు ఇంకా బస్సులు నడవడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

- అక్షరటుడే, లింగంపేట

బస్సులు నడవక అవస్థలు

- రోడ్లు ధ్వంసం అవడంతో నిలిచిన బస్సులు
- పలు గ్రామాలకు ఇంకా పునరుద్ధరించని వైనం
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

కామారెడ్డి నుంచి లింగంపేట మధ్యలో లింగంపల్లి కుర్దు సమీపంలోని పాములా వాగు వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది. వంతెన సైతం శిథిలావస్థలోకి చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు ఈ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే బస్సులను మాత్రం అనుమతించడం లేదు. భారీ వర్షం కురిసి 12 రోజులు గడుస్తున్నా లింగంపేట నుంచి కామారెడ్డి, ఎల్లారెడ్డి ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడవకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

పోల్కంపేట మీదుగా బస్సులు

వంతెన ప్రమాదకరంగా ఉండడంతో భారీ వాహనాలను నిషేధించారు. దీంతో ఆర్టీసీ అధికారులు కామారెడ్డి నుంచి పోల్కంపేట చౌరస్తా వరకు బస్సులను పునరుద్ధరించారు. అక్కడి నుంచి లింగంపేటకు ఎల్లారెడ్డికి ప్రయాణికులు ఆటోల్లో ప్రయాణాలు చేస్తున్నారు. 12 రోజులైనా తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు అధికారులపై మండిపడుతున్నారు.

సీఎం ఆదేశించినా..

పాముల వాగుపై వంతెనను ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ చీఫ్ మోహన్ నాయక్‌ను ఆదేశించారు. తాత్కాలిక వంతెన కోసం రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అయినా కానీ ఇప్పటి వరకు వంతెన పనులు పూర్తి కాలేదు. దీంతో లింగంపేట-గోపాల్‌పేట, లింగంపేట-పోల్కంపేట మార్గాల్లో బస్సులు నడవడం లేదు. ఆయా మార్గాల్లోని గ్రామాల నుంచి కాలేజీలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆటోల్లో ప్రయాణాలు చేస్తుండగా పలువురు చదువుకు దూరం అవుతున్నారు. అధికారులు స్పందించి లింగంపల్లి వద్ద తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసి బస్సులను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

పది రోజుల్లో తాత్కాలిక వంతెన

లింగంపల్లి కుర్దు వద్ద కేకేవై రహదారిపై పాముల వాగు మీద తాత్కాలిక వంతెన పది రోజుల్లో పూర్తి చేస్తాం. రెండు రోజుల్లో టెండర్ పూర్తి అవుతుంది. పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం.

– నారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ

తెయూలో విద్యార్థుల ఆందోళన

అక్షరటుడే, డిచ్‌పల్లి: తెలంగాణ విశ్వవిద్యాలయంలోని హెల్త్‌కేర్ సెంటర్ ఎదుట సోమవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. సెంటర్‌లో పూర్తిస్థాయిలో ఔషధాలను అందుబాటులో ఉంచాలని వర్సిటీ ఏబీవీపీ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్‌లర్, రిజిస్ట్రార్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ ఏబీవీపీ కార్యదర్శి సమీర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఈ యూనివర్సిటీలో కనీసం హెల్త్ సెంటర్ నిర్వహణ లేకపోవడం బాధాకరమని, సెంటర్‌లో పూర్తిస్థాయి మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. 24 గంటలపాటు రెగ్యులర్ డాక్టర్‌ను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరారు. ఆందోళన విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ యాదగిరి విద్యార్థి నాయకుల దగ్గరికి చేరుకొని వారితో చర్చించారు. పూర్తిస్థాయి వసతుల కల్పనకు వైస్ ఛాన్స్‌లర్ యాదగిరి రావుతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో వర్సిటీ ఏబీవీపీ విద్యార్థి నాయకులు సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ, హరిత విద్యాలయపై శిక్షణ

అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలకు సోమవారం స్వచ్ఛ, హరిత విద్యాలయ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. మండలకేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో పరిశుభ్రత, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం, కిచెన్ గార్డెన్, నీటి సంరక్షణ, నీటి పరీక్షలు భూసార పరీక్షలు, హ్యాండ్ వాష్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో శుభ్రత అలవాటు పెంపొందించేందుకు పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు కేంద్రం ఈ కార్యక్రమం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ పద్మ, శంకర్, రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా వీసీఏ – పీసీఏ దినోత్సవం

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని డా కిరణ్ (విష్ ఫర్టిలిటీ) ఆస్పత్రిలో సోమవారం వాలంటరీ కస్టమర్ అసోసియేషన్ (వీసీఏ), ప్రొఫెషనల్ కస్టమర్ యాక్టివిస్ట్ (పీసీఏ) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య, తెలంగాణ, ఆలిండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో సీసీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సందు ప్రవీణ్, ఏఐసీడబ్ల్యూసీ రాష్ట్ర కార్యదర్శి రాజుల రామనాథం, సౌత్ ఉపాధ్యక్షులు తంగనపల్లి శ్రీనివాస్, ఇందూర్ వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు పెందొట అనిల్ హాజరయ్యారు. ఈ సదర్భంగా వీసీఏ, పీసీఏ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఏటా సెప్టెంబర్ 6 నుంచి 9 వరకు దేశవ్యాప్తంగా వీసీఏ, పీసీఏల సంక్షేమం కోసం దినోత్సవం జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు వర్మ, జిల్లా సంయుక్త కార్యదర్శులు శ్రీనివాస్, నరసింహ చారి పాల్గొన్నారు.

గన్నారంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం

అక్షరటుడే, ఇందల్వాయి: మండలంలోని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గన్నారంలో క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 250 మందికి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, 60 ఏళ్లపైబడి, డయాబెటిస్‌తో బాధపడుతున్నవారు, పొగ తాగేవారు, మద్యం అలవాటు ఉన్నవారు, గతంలో క్షయ వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు నిర్వహించారు. అలాగే 40 మందికి తెమడ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఈవో శంకర్, స్రవంతి, కీర్తన, సుచరిత, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ పద్మ, హెల్త్ విజిటర్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిచేయాలి

అక్షరటుడే, కోటగిరి : తప్పులతడకగా ఉన్న ఓటరుజాబితాను అధికారులు వెంటనే సరి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఏముల నవీన్ కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ గంగాధర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన ఓ పురుషుడికి ట్రాన్స్ జెండర్‌గా ఓటర్ లిస్టులో నమోదు చేశారని వివరించారు. పోచారం సురేందర్ రెడ్డి అనే వ్యక్తి కోటగిరిలో నివాసం లేకపోయినా ఓటు వచ్చిందన్నారు. వెంటనే జాబితాను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు హౌగిరిరావు దేశాయ్, మామిడి శ్రీనివాస్, వడ్ల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

అక్షరటుడే, భీమ్‌గల్: భీమ్‌గల్, వేల్పూర్, బాల్కొండ, మోర్తాడ్ మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను విడుదల చేస్తూ ఏర్పాటు చేసిన సమావేశంలో భాగంగా ఎన్నికల నిర్వహణపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు , సూచనలు స్వీకరించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై ట్రక్కులో చెలరేగిన మంటలు

అక్షరటుడే, ఇందల్వాయి : జాతీయ రహదారి పై ట్రక్కులో మంటలు చెలరేగాయి. ఈ ఘటన ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద సోమవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఓ లాజిస్టిక్‌కు చెందిన ట్రక్కు హరియాణా నుంచి సరుకుతో నాగ్‌పూర్ వైపు వెళ్తోంది. సోమవారం ఉదయం ఇందల్వాయి టోల్ ప్లాజా వద్దకు చేరుకోగా.. డీజిల్ ట్యాంకు నుంచి మంటలు చెలరేగాయి. మంటలు భారీగా ఎగిసి పడడంతో స్థానికులు పక్కనే ఉన్న బోరు ద్వారా మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

నగరంలో రోడ్డు ప్రమాదం.. ఒకరికి తీవ్ర గాయాలు

అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని మూడో టౌన్ పరిధిలోని అయ్యప్పగుడి వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మూడో టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రైల్వే కమాన్ సమీపంలోని అయ్యప్ప గుడి వద్ద బైక్‌పై వెళ్తున్న సంతోష్ అనే వ్యక్తిని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం అతడిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లుగా తెలిసింది. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఆలూర్‌లో స్థానిక ఎన్నికలపై సమావేశం

అక్షరటుడే, ఆర్మూర్ : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఆలూర్ మండల కేంద్రంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల ముసాయిదా విడుదల చేశారు. అనంతరం ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సలహాలు, అభ్యంతరాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఆర్మూర్ ఏఎంసీ డైరెక్టర్ మల్లారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు విజయ్, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, బీజేపీ నాయకులు సుభాష్, బీఆర్ఎస్ నాయకులు మోహన్ రెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రోగుల ఇబ్బందులు

కామారెడ్డి జీజీహెచ్‌లో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు.ఆస్పత్రిలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని వైద్యాధికారులు చెబుతున్నా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి. సోమవారం జీజీహెచ్‌లో ఆస్పత్రి సిబ్బంది లేక వృద్ధులు, రోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొదటి, రెండో అంతస్తులకు రోగులను వీల్‌చైర్‌లో తీసుకెళ్లేందుకు సిబ్బంది లేకపోవడంతో రోగుల బంధువులే ఆస్పత్రి సిబ్బంది అవతారమెత్తారు. కుటుంబ సభ్యులే పైఅంతస్తులకు వీల్‌చైర్‌లో రోగులను తీసుకు వెళ్లారు. ఓ వృద్ధురాలిని తన మనవరాలు ఎమర్జెన్సీ వార్డు నుంచి రెండో అంతస్తుకు వీల్‌చైర్‌లో తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడింది. తీరా రెండో ఫ్లోర్ వద్దకు తీసుకెళ్లాక అక్కడున్న సిబ్బంది వీల్‌చైర్ వార్డులోకి తీసుకెళ్లారు. ఇలాంటి ఘటనలు ఆస్పత్రిలో నిత్యం కనిపిస్తాయని రోగులు, బంధువులు చెబుతున్నారు. 'మా వాళ్లను మేమే వీల్‌చైర్‌లో తీసుకెళ్లాక ఇక్కడ సిబ్బంది అవసరం ఏముంటుందని, వాళ్లకు జీతాలు ఇవ్వడం ఎందుకు' అని బంధువులు ప్రశ్నిస్తున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి